క్లుప్తంగా

ముందుగా గుర్తిస్తే ఆటిజం దూరం



మాట్లాడుతున్న డాక్టర్ విజయానందబాబు

కర్నూలు (హాస్పిటల్) : చిన్నపిల్లల్లో ముందుగా గుర్తిస్తే ఆటిజం వ్యాధిని నివారించవచ్చని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానంద బాబు చెప్పారు. ఆటిజం అవగాహన దినం సందర్భంగా మంగళవారం ఇండియన్ అసోసియేషన్ పీడియాట్రిక్స్(ఐఏపీ) కర్నూలు విభాగం, పెద్దాసుపత్రి చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానంద బాబు మాట్లాడుతూ ఆటిజం గురించి, పిల్లల్లో భావ వ్యక్తీకరణ సమస్యల గురించి తల్లిదండ్రులకు వివరించారు. చిన్నపిల్లల్లో ఉన్న మానసికపరమైన రుగ్మత ఆటిజం అని, త్వరగా గుర్తించి సరైన పద్ధతిలో వారికి డెవలప్‌మెంటల్ థెరపీ ఇవ్వాలన్నారు. దీని వల్ల త్వరగా వారిని మిగతా పిల్లలతో పాటు తయారు చేయవచ్చన్నారు. అనంతరం ఆటిజం దుష్ఫలితాల గురించి ఐఏపీ సెక్రెటరీ డాక్టర్ రత్నాకర్‌రెడ్డి వివరించారు.

11న రాతిదూలం పోటీలు

కల్లూరు : ఉగాది ఉత్సవాల సందర్భంగా కల్లూరులో ఈ నెల 11న రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కల్లూరు గ్రామ పెద్దలు, ప్రజలు, రైతులు తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం సాయంత్రం కల్లూరు ఊరు వాకిలి వద్ద గ్రామస్తులు నాగలక్ష్మయ్య, ఎన్‌వీ రామకృష్ణ, శ్రీనివాసులు, పవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, మహేశ్వరెడ్డి, దేవదానం, మాలిక్ బాషా, రామశేఖర్, మల్లయ్య తదితరులు ఆవిష్కరించారు. పోటీలలో పాల్గొన్న వారికి శ్రీ శ్రీ అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థాన్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

మోడరేషన్ బోర్డులో అర్హులను నియమించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలల రెండో సెమిస్టర్ రికార్డుల వెరిఫికేషన్‌కు నియమిస్తున్న మోడరేషన్‌బోర్డులో అర్హులైన, అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించాలని అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఏఎస్ఈ కళాశాలలోని గెస్ట్ ఫ్యాకల్టీని, కళాశాలల కరస్పాండెంట్లను నియమించడం తగదని పేర్కొన్నారు. అర్హులను నియమించకపోతే విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు.

ప్రచారానికి అనుమతులు తప్పని సరి

కర్నూలు (టౌన్): ఎన్నికల ప్రచార వాహనాలకు, కరపత్రాల ముద్రణకు అనుమతులు తప్పని సరి అని నగరపాలక అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. ప్రచార వాహనాలు, కరపత్రాల ముద్రణ, పంపిణీ వాటికి సంబంధించి అనుమతులు తీసుకోవాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

బ్యాంకు పాయింట్ నిర్వాహకుడిపై చర్యలకు డిమాండ్

కర్నూలు(సెంట్రల్): అస్పరి ఏపీజీబీ బ్యాంకు ఎదుట బ్యాంకు పాయింట్ నిర్వాహకుడిగా పని చేస్తున్న శంకరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ముత్తుకూరుకు చెందిన ఉప్పర చంద్రన్న, సరేంద్రయాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏపీజీబీ రీజినల్ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమను వేరే ధ్యాసలో ఉంచి వేలి ముద్రలు వేయించుకొని రూ.6 వేలు డ్రా చేసినట్లు ఉప్పరచంద్రన్న తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోకపోతే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమించాల్సి వస్తుందన్నారు.

నడుద్దాం రండి!

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు స్థూలకాయానికి దారి తీస్తున్నాయి. దీంతో శరీరానికి శ్రమ లేక చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా షుగర్, బీపీ వ్యాధులు వచ్చిన వారికి మొదట వాకింగ్ చేయమంటారు వైద్యులు. బరువు తగ్గించుకుంటే ఆటోమేటిక్‌గా వ్యాధులు తగ్గుముఖం పడతాయనేది ఇప్పటికే నిరూపణ అయిన సత్యం. అందుకే ఇటీవల కాలంలో అధిక శాతం మంది నడకకు మించిన వ్యాయామం లేదని మైదానాలు, రహదారుల వెంట కాళ్లకు పనిచెబుతున్నారు. నేడు నేషనల్ వాకింగ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

- పైసా ఖర్చులేని వ్యాయామం
- నడకతో కండరాలు, ఎముకల పటిష్టత
- దీర్ఘకాలిక వ్యాధులూ నియంత్రణలోకి
- మైదానంలో వాకర్ల సందడి
- నేడు నేషనల్ వాకింగ్ డే



నగరంలోని డాక్టర్స్ కాలనీ పార్కులో వాకింగ్ చేస్తున్న మహిళలు

కర్నూలు(హాస్పిటల్): వ్యాయామాల్లో నడకకు మించిన తేలికపాటి వ్యాయామం లేదు. దీనికి వయస్సు పనిలేదు. లింగబేధం అసలే లేదు. ఏ వయస్సు వారైనా ఎప్పుడైనా, ఎక్కడైనా కొనసాగించొచ్చు. ఇందుకోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయనవసరం లేదు. నడక వల్ల బరువు తగ్గడంతోపాటు ఎన్నో ఉపయోగాలు, ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే ప్రతి ఒక్కరికీ వైద్యులు నడక మంచి వ్యాయామంగా సూచిస్తున్నారు. దీంతో ఇటీవల కాలంలో వాకర్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆయా చోట్ల వాకర్స్ అసోసియేషన్స్ కూడా ఏర్పాటు కావడం గమనార్హం. కర్నూలు నగరంలో సిల్వర్‌జూబ్లీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కర్నూలు మెడికల్ కాలేజీ, ఎస్‌టీబీసీ కళాశాల, అవుట్‌డోర్ స్టేడియం మైదానాలు వాకర్స్‌తో కిటకిటలాడుతుంటాయి. దీంతో పాటు కలెక్టరేట్ ఆవరణ, కేసీ కెనాల్ బండ్, నంద్యాల రోడ్డు, నందికొట్కూరు రోడ్డు, గుత్తిరోడ్డులలో వాకర్స్ ఉదయం వేళ తమ కాళ్లకు పనిచెబుతూ ఉంటారు. కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండలలోనూ వాకర్స్ క్లబ్‌లు వెలిశాయి.

ఎంత నడిస్తే ఏ మేరకు బరువు తగ్గుతారు

ఒక మైలు దూరాన్ని 13 నిమిషాలు, అంతకన్నా తక్కువ సమయంలో నడిచినట్లయితే వంద క్యాలరీలు ఖర్చు అవుతాయి. ఈ లెక్కన ఎంత బరువు తగ్గాలనుకున్నా, దానికి ఎన్ని మైళ్లు నడవాలో మీరే నిర్ణయించుకోవచ్చు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడిచినట్లయితే ఒక పౌండు బరువు తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఉదయాన్నే నడక మేలు

బరువు తగ్గాలనుకునే వారు తప్పనిసరిగా ఉదయాన్నే నడవాలి. ఈ సమయంలో సూర్యకిరణాలు శరీరానికి విటమిన్-డి అందేలా చూస్తాయి. ఆ విటమిన్ కూడా బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది. ఉదయాన్నే నిద్రలేవడం వల్ల జీవక్రియల రేటు సక్రమంగా ఉంటుంది. ఉదయం పూట జాగింగ్ చేయడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీనికితోడు ఉదయాన్నే నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని కొవ్వులు, క్యాలరీలు అధికంగా కరుగుతాయి.

జాగింగ్ చేయాలిలా..

పరుగు వల్ల ఆరోగ్యంతో పాటు శరీరాకృతిలోనూ మార్పులు వస్తాయి. తొడలు, పిరుదులు, పొట్టచుట్టూ ఉండే కొవ్వు పదార్థాలు కరిగిపోతాయి. వలయాకారంలో ఉండే ట్రాక్‌లో 40 నిమిషాల్లో నాలుగు కిలోమీటర్లు పరిగెత్తాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా పరిగెత్తేటప్పుడు...మొదట వార్మప్ కోసం నాలుగు రౌండ్లు(రౌండ్ 400 మీటర్లు) మామూలుగా నడవాలి. తర్వాత రెండురౌండ్లు నడకలాంటి పరుగుతో వెళ్లాలి. ఒక రౌండు వేగవంతమైన నడక, రెండు రౌండ్లు నడకలాంటి పరుగు చేయాలి. తర్వాత ఒక రౌండు వేగం పెంచి నడిచి, ఒక రౌండు కాస్త తక్కువ వేగంతో నడవాలి. చివరగా రెండు రౌండ్లు సాధారణమైన నడకతో వ్యాయామం ముగించాలి.

నడకతో ప్రయోజనాలు

- బరువును సమంగా ఉంచుతుంది.
- ఎవరైనా చేయవచ్చు. దీనికి ఖర్చు పెట్టే అవసరమూ లేదు.
- ఎలాంటి పరికరాలు అవసరం లేదు.
- ఉత్సాహంగా ఉండేందుకు చాలా తేలికైన ఉపాయం.
- కుంగుబాటును, అతిశయోక్తిని తగ్గిస్తుంది.
- ఒత్తిడి లేని వ్యాయామం
- శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది.
- బీపీని నియంత్రణలో ఉంచుతుంది.
- కొన్ని క్యాన్సర్ వ్యాధులు రాకుండా నిరోధిస్తుంది.
- షుగర్ వ్యాధి ఉన్న వారికి బాగా పనిచేస్తుంది.
- మానసిక స్థితిని బలపరుస్తుంది.
- ఎముకలను గట్టిగా, దృఢంగా చేస్తుంది.
- గుండెపోటు సమస్య రాకుండా కాపాడుతుంది.
- శరీర కండరాలను సమతులంగా చేస్తుంది.
- ఉదయాన్నే నిర్దిష్ట సమయానికి వాకింగ్ చేయడం వల్ల క్రమశిక్షణ అలవడుతుంది.
- విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గి, వారు చదువుకున్నది బాగా గుర్తుంటుంది.

చిన్నప్పటి నుంచి వాకింగ్ చేస్తున్నా..



నేను చిన్నప్పటి నుంచి క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తున్నా. ప్రతిరోజూ 15వేల నుంచి 16వేల అడుగులు...8 కి.మీ పాటు నడక సాగిస్తాను. దీనివల్ల నాకు ఎలాంటి అనారోగ్య సమస్యలూ రాలేదు. 50 ఏళ్లు వచ్చినా ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను. ఒక్క రోజు వాకింగ్‌కు వెళ్లకపోతే ఏదో కోల్పోయినట్లు వెలితిగా అనిపిస్తుంది. అందుకే ఏ మాత్రం సమయం లభించినా వాకింగ్ చేస్తుంటాను. ఇది నాకు దిన చర్యలో ఓ భాగమైపోయింది.

-కె. ప్రకాష్‌రావు, ఉపాధ్యాయుడు, కర్నూలు

15 సంవత్సరాలుగా వాకింగ్



నేను 15 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నా. దీంతో పాటు ఇటీవల కొంత కాలం నుంచి జిమ్‌కు వెళ్తున్నాను. దీనివల్ల శారీరకంగా ఫిట్‌గా ఉన్నా. మా అమ్మానాన్నకు షుగర్ ఉంది. నాకు రాకుండా ఉండేందుకు ఈ అలవాటు చేసుకున్నా. 50 ఏళ్లు వచ్చినా ఎంతో ఆరోగ్యంగా ఉన్నా. వాకింగ్ చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉండేటట్లు చేస్తుంది.

-డి. ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కర్నూలు

శరీర బరువు నియంత్రణలో ఉంటుంది



రెగ్యులర్‌గా వాకింగ్ చేయడం వల్ల ఎముకల్లో కాల్షియం తక్కువ కావడమనే సమస్య ఉత్పన్నం కాదు. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. దీనివల్ల కీళ్లపై భారం పడదు. ఈ కారణంగా భవిష్యత్‌లో వారికి మోకాళ్లనొప్పులు రాకుండా ఉంటాయి. ఇప్పటికే మోకాళ్లనొప్పులు ఉన్న వారు సాధారణ వ్యక్తుల వలే గాకుండా కాస్త తక్కువ శ్రమతో నడవాలి. ఇలాంటి వారు ఎక్కువగా ఫిజియోథెరపీ వ్యాయామాలు చేయడం ఉత్తమం. శరీరానికి తగినంత శ్రమ కల్పించడమే ముఖ్యం.

-డాక్టర్ విజయకృష్ణారెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్, కర్నూలు

• దువామే యాద్ రఖో

నగరంలోని స్థానిక కొత్తపేట సయ్యద్ ఖాదర్ మసీదులో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ మంగళవారం సాయంత్రం నమాజ్ చేశారు. తోటి ముస్లింలు, మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అంతకు ముందు తన గెలుపునకు సహకరించాలని, ప్రార్థన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌జే హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ ఎస్ జావెద్ హుస్సేన్‌ను కలిసి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.



నమాజ్ తర్వాత ముస్లింలతో ఇంతియాజ్

కాలినడక భక్తులకు అన్నప్రసాద వితరణ

కర్నూలు కల్చరల్: సూర్య నారాయణ స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో కాలి నడకన శ్రీశైలం వెళ్లే కర్ణాటక భక్తులకు అల్పాహారం, అన్నప్రసాద వితరణ, తాగు నీరు, మజ్జి ప్యాకెట్ల పంపిణీ జరిగింది. మంగళవారం నగర శివారులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరంలో ట్రస్ట్ సభ్యులు భక్తులకు సపర్యలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ భక్తుల దాహార్తి, ఆకలి తీర్చేందుకు తాగునీరు, అన్నప్రసాద వితరణ చేస్తున్నామన్నారు. శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ నగేష్, శ్రీదేవి, రాఘవేంద్ర శర్మ, రామ మహేశ్వరప్ప, చిన్మ యి, మాధవి, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటక భక్తులకు అల్పాహారం పంచుతున్న ఆలయ కమిటీ సభ్యులు

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కర్నూలు (హాస్పిటల్): హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిని కాన్పునకు వారం రోజులు ముందుగానే ప్రభుత్వాసుపత్రిలో చేర్చాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం స్థానిక ఇల్లూరు నగర్‌లోని యూపీహెచ్‌సీలో ఆశాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఏఎన్ఎం హెల్త్ యాప్‌లో గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టప్రకారం నేరమని, దీనిని అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లింగ వివక్ష నిర్మూలన, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంను అమల్లోకి తెచ్చిందన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, స్త్రీల పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదన్నారు. ఆరోగ్య సిబ్బంది ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ నాగ సౌమ్య, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలి

కర్నూలు సిటీ: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లను విద్యాశాఖ అధికారులు అడ్డుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.జాన్సన్ బాబు, శివారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చంద్రరాజేశ్వరరావు భవనంలో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు అడ్డగోలుగా విద్యా సంవత్సరం పూర్తికాక ముందే అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా విద్యా సంస్థల యాజమాన్యాలు పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారని, దీంతో పాటు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘాల నాయకులే రంగంలోకి దిగి అక్రమ అడ్మిషన్లను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్, అల్తాష్, శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు రంగస్వామి, విజేంద్ర, థామస్, తదితరులు పాల్గొన్నారు.

అవి-ఇవి

జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు (లీగల్) : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావును బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మంగళవారం జిల్లా కోర్టు చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం.నిత్యజీవన్ రాజు, సహాయ కార్యదర్శి డి.విక్రమ్ సింగ్, కోశాధికారి ఎం.మహబూబ్ బాషా, గ్రంథాలయ కార్యదర్శి ఎస్.రామ్‌నాథ్, మహిళా ప్రతినిధి జి.సుమనరాణి, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి బి.సుధీర్, పి.దస్తగిరి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, జగదీష్, ఎస్.రాజేష్ బాబు, ఈ.రాజేష్ పాల్గొన్నారు.

అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

కర్నూలు(సెంట్రల్): రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి జి.రాంపుల్లయ్య యాదవ్ పోటీలో నిలువనున్నారు. ఇక కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీ కృష్ణ, నందికొట్కూరు నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ బరిలో నిలువనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

బ్యాగులో బంగారు నగలు మాయం

కర్నూలు : ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన ఈడిగ సుజాత బ్యాగులో బంగారు నగలు మాయమయ్యాయి. గత నెల 25వ తేదీన కర్నూలులో ఉన్న బంధువుల ఇంటికి వచ్చి తిరిగి ఊరికి వెళ్లేందుకు కర్నూలులోని సి.క్యాంప్ సెంటర్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు తన బ్యాగులో ఉన్న పర్సును దొంగిలించారని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పర్సులో రెండు తులాల బంగారు చైను, సెల్ ఫోన్, ఇంటి తాళాలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధం

కర్నూలు సిటీ: మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇందులో రైతులు కె.శేషన్నకి చెందిన రెండు , టి.శ్రీనివాసులుకు చెందిన రెండు, బి.వేణుకు చెందిన ఒక గడ్డివాము ఉంది. మంటలను స్థానికులు గుర్తించి వెంటనే కర్నూలు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఫైరింజిన్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసింది. అప్పటికే ఆ ఐదు గడ్డివాములు కాలిపోయాయి. ప్రమాదం జరిగిన తీరును చూస్తే ఎవరో నిర్లక్ష్యంగా సిగరెట్, బీడీ కాల్చి పారివేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. ప్రమాదంలో మొత్తం రూ.1.90 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌లపై అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో మార్చి నెల ఆరోగ్యశ్రీ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. మొత్తం 2,779 లక్ష్యాన్ని నిర్దేశించగా అదనంగా మరో 126 కేసులు పూర్తి చేశారని అభినందించారు. ఈ-హాస్పిటల్ సైతం బాగా అమలు చేశారని కొనియాడారు. ఏఎంసీ, ఎస్ఐసీయూ, మెడికల్ ఓపీ, క్యాజువాలిటీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది డ్యూటీ షిఫ్ట్‌ల గురించి ఆరా తీశారు. ప్రతిరోజూ ఎంత మందికి డ్యూటీలు వేస్తున్నారు. సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారా అని వివరాలు అడిగారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్యసేవలపై నర్సింగ్ సిబ్బంది ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఏఎంసీ విభాగానికి ఉండే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారికి అక్కడే డ్యూటీలు షిఫ్ట్‌ల వారీగా వేయాలన్నారు. ఐపీ, ఓపీలలో యూహెచ్ఐడీ 11 అంకెల నెంబర్ కేస్‌షీట్, ఇన్వెస్టిగేషన్‌లను ప్రాపర్‌గా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులకు సంబంధించిన ప్రధాన హాజరు పట్టిలో సంతకాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. లేని పక్షంలో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన బీమా పథకంలో వారి పేరు, చిరునామా నమోదు సక్రమంగా రాయాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.



క్యాజువాలిటీ తనిఖీ చేస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

రైతులను భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయం



జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం ఎర్రకత్వ, కొల్లంపల్లి తండాల పరిధిలో ఏర్పాటు చేయనున్న విద్యుత్ టవర్ల కోసం బలవంతంగా గ్రీన్ కో కంపెనీ రైతులను భయభ్రాంతులకు గురి చేసి భూములను లాక్కొంటోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ విమర్శించారు. మంగళవారం ఆయా గ్రామాల రైతులు కలెక్టరేట్ ఎదుట కంపెనీ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతుల అనుమతి లేకుండా గ్రీన్‌కో కంపెనీ దౌర్జన్యంగా భూములను తీసుకోవడం, పరిహారం ఇవ్వకపోవడం, పోలీసులతో కొట్టించడం దారుణమన్నారు. ఉలిందకొండ ఎస్ఐ కంపెనీ ప్రతినిధిగా మారి రైతులపై దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. అనంతరం జేసీ నారపురెడ్డి మౌర్యను ఆమె కార్యాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధు, రాఘవేంద్ర, శివశంకర్, గోవిందు, సూరరంగడు,సోమ్లా నాయక్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఏడీ, డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్) : ఇటీవల విజయవాడలో రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17, అండర్-19 విభాగాల్లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. బాలుర విభాగంలో ధనుష్ (కాంస్యం), బాలికల విభాగంలో రాధమ్మ, కౌసల్య సంధ్య, సుమియా మిత్ర, యశోద, ధీరజా రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు. వీరిని స్థానిక మాంటిస్సోరి పాఠశాల ప్రాంగణంలో విద్యాశాఖకు చెందిన ఏడీశామ్యూల్ పాల్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కేజీబీవీ స్కూల్ నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి వేణుగోపాల్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బాషా, మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- చెప్పిన వాటితో పాటు చెప్పనవి కూడా చేశాం
- చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దు
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు అర్బన్ పరిధిలోని 35వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామన్నారు. చెప్పిన వాటితో పాటు చెపనవి కూడా ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేశామన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం నవరత్నాలు తీసుకువచ్చారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే మరోసారి రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు టీడీపీ నేతలు ప్రజల ముందుకు వస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని ఎమ్మెల్యే కాటసాని సూచించారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల జగనన్న పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధురి, పలువురు కార్పొరేటర్లు, వార్డులోని నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

సార్వత్రిక ఎన్నికలు సమీస్తున్న కొద్ది పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు భారీగా పెరిగాయి. మంగళవారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. గ్రామ నాయకులు కేవీ రమణారెడ్డి, ఏపీ రమణ ఆధ్వర్యంలో బోయ రాజు, ఫిరోజ్, శ్రీను, హరి, వేణు, అల్తాఫ్, సత్యం, వెంకటేశ్వర్లు, అనిల్, మంగలి రంగస్వామి, పింజరి సాయి, బోయ రవితో పాటు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కాటసాని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో యాపర్లపాడు సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, ఉలిందకొండ గ్రామ నాయకులు శ్రీనివాసులు, నగేష్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.